# ఇది ఉన్నవాళ్ళ కథ

తమ బాగు తెలియనివాళ్ళు — చీకటీ వెలుగూ ఒకటి కావాలని కోరుకుంటారేమోగాని ఉన్నవాళ్ళు మాత్రం చీకటినే యిష్టపడతారు. వెలుగులో కుళ్ళూ కుష్ఠూ రొష్ఠూ అంతా కనిపిస్తుంది. వాటిని చూస్తే అసహ్యం కలుగుతుంది. జీవితం మీద జుగుప్స ఏర్పడుతుంది. అందుకే, ఉన్నవాళ్ళు గొప్పవాళ్ళనిపించుకొనేవాళ్ళు చీకటినే ప్రేమిస్తారు. చీకటితో తమ జీవితాలు ముడి పెట్టుకుంటారు. చీకటిలో కనిపించే అపురూపాలు, సృష్టించుకున్న స్వర్గాలు తమ సొంతం అన్నట్లు తనివి తీరా అనుభవిస్తారు.

తొలిసారి బి. కె. రాయుడుగారింట్లో- ఆ వాతావరణం చూసినప్పుడు యస్సాయి రాజేశ్వరరావు అలాగే అభిప్రాయపడ్డాడు.

సన్నగా చీకటి పడుతోంది.

వింత వింత వెలుగుల్లో, విలువగల మనుషులతో రాయుడిగారి బంగళా కళకళలాడుతోంది. బయట ప్రపంచంలో దరిద్రమూ, చీకటీ అక్కడ కనిపించడం లేదు. వెన్నెల వెలుగుల్లాంటి వెలుగులో చిరునవ్వులే కనిపిస్తున్నాయి. జీవితం చిన్నది కాదని, చాలా పెద్దదని, అందులో ప్రతి క్షణమూ మధురిమల మయమనిపిస్తుంది.

బి. కె. రాయుడిగారి బంగళా — నిత్యం నరకాన్ని అనుభవించే సామాన్య ప్రజానీకానికి దూరంగా, జీవితంలో తియ్యదనాన్ని చవిచూస్తున్న ఉన్నవాళ్ళకి చేరువుగా, నిరంతరమూ కెరటాల హోరు వినిపించే సముద్రానికి దగ్గరగా ఉంది. ఆ బంగళాలో పని చేస్తున్న నౌకర్లకి కూడ కష్టాలనేవి తెలియవు. వాళ్ళు కూడ దొరబాబుల్లా ఉంటారు. ఆ నౌకర్లు — ఆ బంగళాలోకి చల్లని వెన్నెల్ని రానిస్తారు తప్ప, సూర్యకిరణాల్ని అసలు రానివ్వరు. రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

ఆ బంగళాలోకి అడుగుపెట్టడానికి దరిద్రులకి దమ్ము ఉండదు. సామాన్యులకి సాహసమూ ఉండదు. అసలు రాయుడిగారికి బీదప్రజలంటే అసహ్యం. కానీ, అతను అసహ్యించుకొనే దరిద్రులు కొందరు బంగళాకి కొంచెం దూరంలో ఉంటున్నారు. వాళ్ళు కట్టుకున్న కొంపలు పురుగుల్లా, ఆ పురుగుల మధ్య ఎండిపోయి, కంపుకొడుతున్న చేపల్లా అక్కడ ఉన్న మనుషులు కనిపిస్తారు. చేపల్లాంటి వాళ్ళు చేపలు అమ్ముకొని, బతుకుతున్నారట.


ఓ సాయంత్రం రాయుడుగారు అటు వేపు చూశారు. అస్తవ్యస్తంగా, అసహ్యంగా ఉన్న ఆ దృశ్యాన్ని చూసి 'హేట్'

'శ్రీరాజ్'

చేశారు. చేపల్లాంటి ఆ మనుషులు చేప ముక్క కోసం కాట్లాడుకొనే కుక్కల్లా ఒకర్నొకరు కొట్టుకోవడం కనిపించింది. వాళ్ళ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. అసహ్యకరమైన భాష. రాయుడుగారు వినలేకపోయారు. ఎప్పుడూ వినిపించే సముద్ర తరంగాల సరిగమలు సరిగ్గా వినిపించలేదు. అందమైన ఆ సాయంత్రం అపురూపంగా కనిపించలేదు. మనసులో చికాకు ఏర్పడింది. ఉప్పెనవచ్చి, తన కంటికి కనిపిస్తున్న దరిద్రు లందర్నీ ఊడ్చుకుపోతే బావుణ్ణనుకున్నారు. కానీ, అనుకున్నట్లు ఉప్పెన రాలేదు. కనిపిస్తున్న దరిద్రుల్ని కొట్టుకు పోలేదుకూడ. ఇంకా ఆ దరిద్రులు కొట్టుకుంటూనే ఉన్నారు.

రాయుడుగారు నౌకర్లని పిలిచి, చీవాట్లు వేశారు. ఆ దరిద్రులూ ఆ దరిద్ర గొట్టు కొంపలూ మరోసారి తన కంటబడితే నౌకర్లందర్నీ - ఆ దరిద్రుల మధ్య బతకటానికి పంపిస్తానని బెదిరించారు. అంతే! అటు వేపు వెండితెరలు కట్టి మళ్ళీ అలాంటి దృశ్యం రాయుడిగారి కంటబడకుండా చేశారు.

ఆ బంగళాలో ఉన్నవాళ్ళకి - లైటుహౌసులో వెలుగులూ, హార్బరులోకివచ్చే పోయే రంగు రంగుల స్టీమర్లూ, కెరటాల మీద తేలుతూ, ముందుకి సాగిపోయే చిన్న చిన్న పడవల వరసలు, నింగీనేలా కలిసి ఉన్నట్లు కనిపించే అందమైన దృశ్యమూ, గుబురుగా పెరిగిన అశోక వృక్షాల మధ్య అధునాతనమైన భవనాలు మాత్రమే కనిపిస్తాయి. ఆ వాతావరణం ఎంతో ఆహ్లాద



కరంగా ఉంటుంది. ఆ బంగళాలోకి ఎవరైనా కొత్తగా అడుగుపెడితే-తను చేసుకున్న పుణ్యానికి దేవతలు కనికరించి, స్వర్గానికి తీసుకు వచ్చారేమోనని కొన్ని క్షణాలు అపోహపడవల్సిందే!

ఆ రోజు పేరడైజ్‌లోకి దేవతల మధ్యకు పిచ్చి కుక్కల్లాంటి దరిద్రులు రాకుండా చాలా కట్టుదిట్టాలు చేశారు. రాయుడుగారు. మిసెస్ కౌసల్య పుట్టిన రోజు పండగను పురస్కరించుకొని, పెద్ద పెట్టున పార్టీ ఏర్పాటు చేశారు. చీకటి పడుతున్న సమయంలో ఉన్నవాళ్ళందరూ అక్కడకు చేరారు. పెద్ద హోదాలో ఉన్న వాళ్ళు వచ్చారు. అందరూ ఒకే తరగతికి చెందినవాళ్ళు. అందరూ ఖరీదైన మనుషులే. వాళ్లు పెంచుకున్న నాగరికతకి, కట్టుకున్న బట్టలకి విలువ కట్టడం ఆషామాషీ కాదు. బహుశా, బందోబస్తుకోసం పెట్టుకున్న పోలీసులే నాగరికతలేని మనుషుల్లా, చవక బట్టల్లో వెలవెలపోతున్నారేమో? అక్కడకు వచ్చినవాళ్ళెవరికీ కారులేకుండా లేదు. ఏదో ఒక ప్రెస్టీజ్ సింబల్ లేకుండా లేదు. ప్రతి వ్యక్తిలో ఓ ప్రత్యేకతఉంది. ప్రత్యేకత ఉన్న వాళ్ళు గనుకే రాయుడిగారితో కరచాలనం చేయగలుగుతున్నారు.

రాజేశ్వర్రావుకి బి.కె. రాయుడిగారితో స్నేహం లేదు. పరిచయమూ లేదు. కానీ, రాయుడిగారికీ పోలీసు డిపార్టుమెంటుకీ అవినాభావ సంబంధం ఉందట. రాయుడిగారింట్లో ఏ ఫంక్షన్ జరిగినా—డియస్పీ మొదలు యస్సయి వరకు పేరు పేరునాపిలవడం రాయుడిగారికిఅలవాటట. ఆ అలవాటు ఆనవాయితీగా కూడ మారిపోయిందని సర్కిలినస్పెక్టరు మూర్తి—రాజేశ్వర్రావుతో చెప్పాడు.

మూర్తి రాజేశ్వరరావుని రాయుడిగారికి పరిచయం చేశాడు.

"ఇతని పేరు రాజేశ్వరరావు. మన స్టేషన్‌కి కొత్తగావచ్చిన యస్సయి. హాకులాంటి కుర్రాడని గుంటూరు నుండి ట్రాన్స్‌ఫర్ చేశారు."


"హౌడూ యూడూ?" రాయుడుగారు చెయ్యి కలిపారు.

రాజేశ్వరరావుకి పెద్దవాళ్ళతో చెలిమి లేదు. పెద్దవాళ్ళతో చేతులూ కలపలేదు. మూర్తి పరిచయం చేయకపోతే అతని చేయి రాయుడుగారి చేతిలో ఉండేది కాదు. ఆ సమయంలో రాజేశ్వరరావు కొంచెం యిబ్బంది పడ్డాడు.

రాయుడుగారు ప్రక్కనే ఉన్న తన అర్ధాంగిని—రాజేశ్వరరావుకి పరిచయం చేశారు.

"షి యీజ్ మై బెటర్ హాఫ్ .. మిసెస్ కౌసల్య."

అందరిలో మిసెస్ కౌసల్య—పేరడైజ్‌లో ముస్తాబు చేసిన 'ఈవ్'లా అందంగా, సుకుమారంగా కనిపిస్తుంది. తెల్లని వెన్నెల ముక్కతో అపురూపంగా మలిచిన బొమ్మలా, తియ్యగా నిండుగా నవ్వుతోంది. తెలియనివాళ్ళు ఆమె రాయుడిగారి కూతురని అపోహపడతారు. ఆమె వయసెంతో ఎవరూ ఊహించలేరు.ఆమెను చూసిన ఆడవాళ్ళు అసూయ పడతారు. మగవాళ్ళు ఆశపడతారు. మనసులో ఆమెను తప్పనిసరిగా ఊహించుకుంటారు. రాయుడుగారు గర్వపడతారు.




అతని ఉన్నతికి ఆమె పునాది రాయి. అతని జీవితానికి పెద్ద వెలుగు. ఆమె లేక పోతే అతనికి వెలుగు లేదు. ఆ బంగళాకి శోభ లేదు.

"మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే మేడమ్" రాజేశ్వరరావు శుభాకాంక్షలు అందజేశాడు.

"థాంక్స్" ఆమె నోటనుండి ఒలికిన ముత్యాలు పేరడైజ్‌లో సన్నని రాగాలు పలికాయి.

అక్కడికి వచ్చిన పెద్దవాళ్ళందరికీ రాజేశ్వరరావుని పరిచయం చేశారు రాయుడుగారు. ఆ సొసైటీతో మూర్తికి బాగా పరిచయం ఉంది. అతను కొత్తగా పరిచయం చేసుకోవలసిన వ్యక్తులెవరూ అక్కడ లేరు.

ఎందుకో తెలీదుగాని రాయుడుగా రంటే డియస్పీగారు పడి చస్తారు. ఊళ్ళో లేకపోవడంవలన అతను పార్టీకి రాలేదు. డియస్పీగారు రారని తెలిసి, రాయుడు గారు నొచ్చుకున్నారు. జడ్జీగారు రావ డంతో రావలసిన అతిథుల సంఖ్య పూర్తయింది.

మిసెస్ కౌసల్య రాకుమారిలా హాలు మధ్యలో అందంగా అలంకరించిన టేబిల్ దగ్గరికి వెళ్ళింది. అందరూ ఆమె చుట్టూ పరివారంలా చేరిపోయారు. 'హేపీ బర్తడే కేక్' మీద వెలిగించిన కొవ్వొత్తుల్ని కౌసల్య ఆర్పింది. 'హేపీ బర్తడే టూ యూ'లు ఆమెను గిలిగింతలు

పెట్టాయి. గాలిలో రంగు రంగుల బెలూన్లు విలాసంగా కదిలాయి. పువ్వుల జల్లులు పడి, ఆమెను మళ్ళీ మళ్ళీ పండు గలు చేసుకోమని దీవించాయి.

కోసిన కేక్ ముక్క తీసి, ముఖర్జీ కౌసల్య నోటికి అందించాడు. రాయుడు గారు చప్పట్లు కొట్టారు. కరతాళ ధ్వను లతో హాలంతా దద్దరిల్లింది.

బయట చిక్కటి చీకటి. సముద్రం హోరు వినిపించడంలేదు. హాలులో మాత్రం సముద్రం అంత వెలుగులో అందరూ పిచ్చిగా అల్లరి చేస్తున్నారు. ఆడా మగా చేతులు కలుపుకొని, లయ బద్ధంగా కదులుతున్నారు.


ముఖర్జీ జోకులు వేస్తున్నాడు. రాయుడు గారు విరగబడి నవ్వుతున్నారు. ఎదురెదు రుగా కూర్చొని, మాట్లాడుకుంటున్న వాళ్ళ ద్దరి వేపు రాజేశ్వరరావు చూస్తూ ఉండి పోయాడు. రాయుడుగారు - ముఖర్జీనికూడ అతనికి పరిచయం చేశారు, ముఖర్జీలో ఉన్న ప్రత్యేకత ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది, రాజేశ్వరరావుకి. మూర్తిని అడిగాడు. ముఖర్జీ తెలుగువాడు కాదట. తెలుగు నేలలో సిమ్మెంటు ఫ్యాక్టరీ పెట్టాలనే ఉద్దేశం అతని కుందట. అతనికి కోట్లున్నాయట. కాటన్ మిల్సున్నా యట. రాయుడు గారికి కొత్త స్నేహితు డట. రాయుడుగార్ని సిమ్మెంటు ఫ్యాక్ట రీలో పార్టనర్‌గా చేర్చుకుంటాడట. మూర్తి - ముఖర్జీ గురించి వివరంగా చెప్పాడు.

ఈసారి రాజేశ్వరరావు - రాయుడిగారి అంతస్తు గురించి ఆలోచిస్తున్నాడు. ఆ రోజుల్లో రాయుడి పాత జీవితం మూర్తి లాంటి కొందరికే తెలుసు. రాయుడుగా రింటికి వచ్చే ముందు మూర్తి చెప్పిన రాయుడి పాత కథ గుర్తొచ్చింది.

ఆ స్తి, అంతస్తూ రాయుడికి తన తల్లి దండ్రుల్నుంచి సంక్రమించినవి కావు. అతను స్వయంకృషితో సమాజంలో తన కొక ప్రత్యేకత సంపాదించుకున్నాడు. అతను ముప్పై ఏళ్ళవరకు నరకం అనుభ వించాడు. దరిద్రంలో కొట్టుకుపోయాడు. దరిద్రుల మధ్య కలిసిపోయాడు. దారుణ మైన జీవితం. బతికుంటే తన తల్లి దండ్రుల్ని గొంతు పిసికి, చంపేవాడు. వాళ్ళు చచ్చిపోయి, బతికిపోయారు. రాయు డికి అలాగే జీవితాంతం దరిద్రుల మధ్య ఉండిపోవాలనిపించలేదు. ఆ జీవితానికి ఆ దరిద్రులకి దూరంగా పారిపోవాలని పించింది. అతనికి కావలసినన్ని తెలివి తేటలున్నాయి. కానీ, చేతిలో కానీ లేదు. కావలసింది డబ్బు. డబ్బుంటేగాని మనిషి మనిషిగా గుర్తింపబడడని అతనికి తెలుసు. డబ్బు గడించాలనీ, మనిషిగా గుర్తింపబడాలనీ అతను ఒట్టు పెట్టుకు న్నాడు.

మొట్టమొదట మురికి పేటలో మురికి మనుషుల సహకారంతో రాయుడు మున్సిపల్ కౌన్సిలరుగా విజయం సాధిం చాడు. మంచి చేస్తాడన్న నమ్మకంతో పెట్టుబడి లేకుండా ప్రజా ప్రతినిధిగా ఎన్నుకున్నారు. అది అతని జీవితంలో తొలి విజయం. అంతా మురికి మను షుల సహకారం.

రెండేళ్ళు తిరిగాయి. మురికి కాలవలు




ఊడ్పించటం పూర్తి కాలేదు. ఎవరి బ్రతుకులో మురికీ ఊడ్చుకుపోలేదు. అసెంబ్లీ ఎలక్షన్లు వచ్చాయి. రాయుడ్ని ఎమ్మెల్యే చేశారు. 'మనలోవాడు, మన కష్ట సుఖాలు తెలిసినవాడు. మనకు దారి చూపిస్తాడ'ని వెర్రి ఆశలు పెంచుకున్నారు. అంతా రాయుడికి ఓటు చేశారు. అతనికి అసెంబ్లీలో చోటు చూపించారు. తమకు ఏ లోటూ ఉండదని, అతనికి పూల కిరీటం తగిలించారు. జేజేలు పలికారు.

"అయ్యా! నేను మీ వాడ్ని కాదు. మీ కష్టసుఖా లేఁవిటో నాకు సరిగా తెలీవు. మీకు దారి చూపించాలంటే నా ఒక్కఁడి వల్ల అయ్యే పని కాదు. మొదట నా దారి నన్ను వెతుక్కోఁనివ్వండి" అని రాయుడు మనసులో అనుకున్నాడు. అంతే! అతని జీవిత క్రమం మారిపోయింది. అతనూ మారిపోయాడు. రాయుడు - రాయుడు గారుగా మారిపోయాడు. రాత్రీ పగలూ గడించాడు. ఇంట్లో, బ్యాంకులో దాచి పెట్టాడు. బంగళా కట్టించాడు. కారు కొన్నాడు. అవసరం అనుకున్న హంగులన్నీ సమకూర్చుకున్నాడు. మారిపోయిన అతని జీవితంలో కౌసల్య అడుగు పెట్టింది. ప్రజలు పిచ్చివాళ్ళని తెలియజేశాడు.

పిచ్చివాళ్ళకి కోపం వచ్చింది. మళ్ళీ సారి రాయుణ్ని ఎమ్మెల్యే చెయ్యకూడదని తీర్మానించుకున్నారు. తీర్మానించుకున్న ఆ మనుషులే తమ ఓట్లు డబ్బుకి

అమ్మ. రాయుణ్ని రెండోసారి కూడా ఎమ్మెల్యేను చేశారు. మనిషి మనసుమీద చిత్రమైన రంగులు పూసి, పని పూర్తి చేసుకోవడం అతనికి బాగా తెలుసు. ఈ సారి అతను పెద్దవాళ్ళ దగ్గర పలుకుబడి సంపాదించుకున్నాడు. గొప్పవాళ్ళతో స్నేహాలు చేశాడు. అనేక పెద్ద వ్యాపార సంస్థల్లో భాగస్తుడయ్యాడు. అతను చిన్నవాళ్ళ చూపుకి అందనంత ఎత్తుకి ఎదిగిపోయాడు. అతను చిన్నవాళ్ళు మాట్లాడుకొనే చిన్న మనిషి కాదు. పెద్దవాళ్ళు గొప్పగా చెప్పుకొనే పెద్ద దేవుడు. అతను అసహ్యించుకొనే పాత జీవితాన్ని తొందరగా మరచిపోయాడు. కానీ, పాత మనుషులు కనబడితే, అనుభవించిన దరిద్రం కళ్ళ ముందు కనిపిస్తుంది. అందుకే అతను బీదప్రజల్ని అసహ్యించుకుంటాడు.

రాయుడు మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు. అతనికి కొన్ని సెంటిమెంట్సున్నాయి. మూడనంకె అంటే అతనికి గిట్టదు. అయిదేళ్ళలో - చేస్తున్న వ్యాపారం పెద్దది చేయాలనీ, అర్ధాంగితో అమెరికా వెళ్ళి రావాలనీ, వచ్చే ఎలక్షన్‌లో మంత్రి పదవిని పొందటానికి తగిన పథకాలు వేయాలనీ ఆలోచించి, అతను విరమించుకున్నాడు. రాయుడి పాత జీవితం అందరికీ కాకపోయినా కొందరు పెద్దవాళ్ళకి బాగా తెలుసు. తెలిసినా, వాళ్ళు తెలియనట్లే ప్రవర్తిస్తారు. ఒకప్పుడు అతనితో కలిసి తిరిగిన మురికి మనుషులు ఇంకా మురికిలోనే బతుకుతున్నారు. అతన్ని పెంచి పెద్ద చేసినవాళ్ళు చీకటిలోనే కొట్టుకుంటున్నారు. వాళ్ళు రాయుడు గురించి ఎప్పుడూ మాట్లాడరు. పెద్దవాళ్ళ గురించి నీచంగా మాట్లాడుకోవడం వాళ్ళకి చేతకాదు.

"మిస్టర్ రాజేశ్వర్రావ్. మంచిగాని, చెడుగాని రాయుడుగారు 'చాలా చక్కగా చేయగలరు. అతను చేసింది 'తప్ప'ని ఎవరూ అనలేరు. అటువంటి అవకాశాన్ని ఎవరికీ యివ్వరు. పెద్దవాళ్ళు కావాలనుకొనేవాళ్ళు అతని దగ్గర కోచింగ్ తీసుకోవాలి" మూర్తి మాటలు గుర్తొచ్చి, రాజేశ్వర్రావు నవ్వుకున్నాడు.

అందరికీ విందు ఏర్పాటు చేశారు.

ఆ రోజు రాయుడుగారు విందుకి ఖర్చు పెట్టిన డబ్బుతో పది కుటుంబాలకి నెల రోజులు గడిచిపోతుంది. కొందరు లేనివాళ్ళు ప్రతిరోజూ పస్తులతో మాడి చస్తున్నారు. రాయుడుగారిలాంటి ఉన్నవాళ్ళు రోజూ విందులతో సరదాగా బతుకుతున్నారు. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళ సమాంతర రేఖల్లో ఎప్పటికీ కలవరేమో? లేనివాళ్ళు - పై మెట్టు మీద ఉన్నా ఉన్నవాళ్ళను చేరుకోలేరు. ఉన్నవాళ్ళు కింది మెట్టుమీద చతికిలబడ్డా లేనివాళ్ళను చూడలేరు. ప్రపంచంలో లేనివాళ్ళు లేకపోతే బావున్ననిపించింది, రాజేశ్వర్రావుకి.

వెలుగూ చీకటీ, హెచ్చు తగ్గులూ, ఉన్నవాళ్ళూ, లేనివాళ్ళూ ఇలా ఎన్నో భేదాలు మనుషుల మధ్య సృష్టించిన పైవాడి ఆంతర్యం ఏమిటో రాజేశ్వర్రావుకి అంతుబట్ట లేదు. సోషలిజం దేవుడికి తెలియదేమో! తెలిసి ఉంటే, ఈ రోజున సోషలిజం గురించి ఎవరూ ప్రత్యేకంగా



'సిరిసిరి మువ్వ'లో చంద్రమోహన్, జయప్రద.

లెక్చర్లిచ్చేవారు కాదు. ఈ భేదాలు సమసిపోయి, అంతా సమానంగా ఉండేవారు. తను పిచ్చిగా ఆలోచిస్తున్నాడేమో!

ఆ సొసైటీలో ఆ మనుషుల మధ్య ఎంతోసేపు ఉండాలనిపించ లేదు, రాజేశ్వరావుకి. ఉంటే - అతనిలో ఎన్నో ఆలోచనలు పరుగులు తీస్తాయి. భోజనం పూర్తి చేసి, అతను వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

స్వీట్ శ్రీవారూ!

పెద్ద ఉద్యోగం చేస్తున్నారు. కానీ, ఏం లాభం? తమరు వెళ్ళి నెల రోజులు దాటినా, ఓ చిన్న అద్దెకొంపను సంపాదించలేకపోయారు. కాసేపు మీ రూల్స్‌ని ప్రక్కకు పెట్టి, మీ జవాన్లకి చెబితే, క్షణాల్లో ఇల్లు సంపాదిస్తారు. ఏమంటారు?

నాకు బోరుకొడుతుంది. పిల్లలు బెంగ పెట్టుకున్నారు. తొందరగా ఇల్లుచూసి, మీ ఇల్లాల్ని, పిల్లల్ని తీసుకువెళ్ళండి. లేదా సెలవుపెట్టి, వెంటనే ఇంటికి రండి. ఇది అత్తయ్య ఆజ్ఞ. అత్తయ్య చెప్పినట్లు బుద్ధిగాఏదో ఒకటి చెయ్యండి. అన్నట్లు ఓ శుభవార్త. నాకు కంగ్రాట్స్ చెప్పడానికి తొందరగా రండి.

ఛీరియోలతో - మీ పెయిర్ లేడీ,
లక్ష్మి.

రాజేశ్వర్రావు ఉత్తరం చదువుకొని, నవ్వుకొన్నాడు. లక్ష్మికి కోపం వచ్చినట్లుంది. నిజమే, మరి. తను వచ్చి, నెల రోజులు గడిచిపోయాయి. తనకుతీరిక లేదు. తీరిక ఉన్న సమయాల్లో కాళ్ళరిగేలా అద్దె కొంపకోసం తిరిగాడు. అనుకూలమైన ఇల్లు ఒకటీ దొరకలేదు. తను ఓ స్నేహితుడి గదిలో గడుపుతున్నాడు. తన ఇన్ఫ్లూయన్స్ ఉపయోగించడం, తన కింది ఉద్యోగుల్ని తన పనికోసం వినియోగించుకోవడం రాజేశ్వర్రావుకి సుతరామూ యిష్టముండదు. వీలుంటే సెలవు తీసుకొని, ఓసారి ఇంటికి వెళ్లాలనిపించింది. లక్ష్మి చెప్పే శుభవార్త వినాలని ఉంది. బహుశా త్రికోణంలో మూడోకోణం 'ఉంగాఉంగా' అంటుందేమో?

రాజేశ్వర్రావు ఉత్తరాన్ని ముద్దు పెటుకున్నాడు.

రాత్రి పది గంటలు దాటింది.

డియస్పీగారు ఫోన్లో రాజేశ్వర్రావుతో మాట్లాడేరు. పట్నంలో అవినీతి పెరిగిపోతుందట. అవినీతి సముద్రంలా పెరిగిపోతే—అదుపులో ఉంచడం కష్టమని, గుర్తొచ్చినప్పుడల్లా డియస్పీగారు - అవినీతిపరుల్ని పట్టుకోమని తనకింది ఉద్యోగుల్ని హెచ్చరిస్తూ ఉంటారు. చీకటిలో కాని పనులనిచేసే మనుషుల్ని కోర్టు కెక్కించా లంటారు. రాజేశ్వర్రావుని


# ఆంగ్లేయబోధిని

పిన్నలు, పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును వెల: రూ. 10/-

# తమిళ్-తెలుగు స్వబోధిని

తమిళభాష రానివారు మా తమిళ-తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును. వెల: రూ. 3/-

# హిందీ-తెలుగు స్వబోధిని

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ-తెలుగు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును. వెల: రూ. 4/-

పై వాటికి పోస్టేజి అదనము.

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్: 29868) :: మద్రాసు 600 001

'రైడ్'కి బయలుదేరమన్నారు.

వెంటనే రాజేశ్వర్రావు అవసరమైన బందోబస్తుతో బయలుదేరాడు.

చిక్కటి చీకటి. విపరీతమైన చలి. వెచ్చటి ముసుగులో ఉన్నవాళ్లు - ఆ చీకటి తొందరగా తొలగిపోకూడదని కోరుకుంటున్నారు.

రాజేశ్వర్రావు - బ్రోతల్ హౌసులూ, లాడ్జీలూ రైడ్ చేశాడు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా పట్టుకున్నాడు. పట్టుబడ్డవాళ్ళ వెనుక పుట్టెడు కారణా లుండవచ్చును. బ్రతుకుమీద తీపి కోసం — అవినీతిగా ప్రవర్తించిన వాళ్ళుండవచ్చును! జీవితంలో థ్రిల్ కోసం అక్రమంగా తిరుగుతున్న వాళ్లుండవచ్చును. తెరలు వెనుక ఉన్న వాళ్ళ కథలు తెలుసుకోవలసిన అవసరం రాజేశ్వర్రావుకి లేదు.పట్టుబడ్డ వాళ్ళందర్నీ వ్యాన్ ఎక్కించాడు.

ఊళ్ళో పెద్దవాళ్లు సరదాలు తీర్చుకొనే ఓ విలాస మందిరం సముద్రపు ఒడ్డున ముడుచుకు పడుకున్న బొచ్చుకుక్కలా ఉంది. ఆ బొచ్చుకుక్కకూడ రాజేశ్వర్రావు దృష్టినుంచి తప్పించుకోలేదు.

పోలీసులు పరుగులు తీశారు.

మూసి ఉన్న ఓ గది తలుపులు బూటు కాలితో తన్నాడు, రాజేశ్వరరావు. లోపల నవ్వులు ఆగిపోయాయి. చూపులు నిలిచిపోయాయి. ఆ ఇద్దర్నీ చూసి, రాజేశ్వర్రావు ఆశ్చర్యపోయాడు. తలుపు దగ్గర ఉండిపోయాడు.

అతను మెత్తని పరుపుమీద వెల్లకిల పడుకొని. ఆమెను రమ్మని చేతులు చాస్తున్నాడు. కళ్ళతో చిలిపిగా మాట్లాడుతున్నాడు. కొన్ని క్షణాలు ఆలోచి స్తేగాని-అతను బి.కె.రాయుడుగారి కొత్తమిత్రుడు, సరికొత్త భాగస్వామి ముఖర్జీ అని రాజేశ్వర్రావు గుర్తు పట్టలేకపోయాడు. రాజేశ్వర్రావుని చూసి - ముఖర్జీ మండి పడ్డాడు. విలువైన ఎ.సి. లాడ్జిలోకూడ పోలీసులు కుక్కల్లా దాపురించారని అసహ్యించుకున్నాడు.

ఆమె పేరడైజ్‌లో ముస్తాబు లేని 'యీవ్'లా అందంగా సుకుమారంగా కనిపిస్తుంది. తెల్లని వెన్నెల ముక్కతో అపురూపంగా మలిచిన బొమ్మలా, తియ్యగా నిండుగా నవ్వుతోంది. ఒంటిమీద బట్టల్లేవు. మనసులో సిగ్గూలేదు. ముఖర్జీకి ఎదురుగా వయ్యారంగా నిలబడింది. తలుపు దగ్గర నిలబడ్డ యస్సైని చూసి. మిసెస్ కౌసల్య ఒంటిమీదికి నలిగిపోయిన చీరను లాక్కుంది. రాయుడుగారు రాజేశ్వర్రావుని పరిచయం చేసిన గుర్తులేదు. కొత్త యస్సయి పో ఆమె సహించలేక పోయింది.

నైతిక విలువలు మరిచిపోయిన ఇద్దర్నీ చూసి, రాజేశ్వర్రావు అసహ్యించుకున్నాడు.

రాజేశ్వర్రావుకి పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు అనే తేడా లేదు. మిసెస్ కౌసల్యను, ముఖర్జీని వ్యాన్‌లో మామూలు మనుషుల మధ్య ఎక్కించాడు. పెద్దవాళ్ల నెత్తిన వున్న పూల కిరీటంలో పూలు గాలికి చెల్లాచెదురుగా ఎగిరిపోయాయి. ఉన్నతంగా బ్రతుకుతున్న వాళ్ళు అతి సామాన్యమైన వ్యక్తికి పట్టుబడి పోయారు. ఇరుకు

వ్యాన్‌లో, చీకటిలో, మామూలు మనుషుల మధ్య కూర్చున్న మిసెస్ కౌసల్య. ముఖర్జీ అవమానంతో కుంచించుకుపోయారు. ఆ సమయంలో వాళ్లకున్న డబ్బూ, హోదా ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

రాజేశ్వర్రావుతో వచ్చిన పోలీసులు ముక్కున వేలేసుకున్నారు. వ్యాన్ పోలీసు స్టేషన్ వేపు కదిలింది.

*　　*　　*

రాజేశ్వర్రావు రిజిస్టరులో సంతకం చేస్తున్నప్పుడు సర్కిలిన్స్పెక్టరు మూర్తి హడావుడిగా వచ్చాడు.

"రాజేశ్వర్రావ్. నేను విన్నది నిజమా?" రాజేశ్వర్రావుకి ఎదురుగా కుర్చీ జరుపుకొని, మూర్తి కూర్చున్నాడు.

అర్ధరాత్రి అర్ధాంతరంగా సి. ఐ. గారు స్టేషన్‌కు ఎందుకు వచ్చారో రాజేశ్వర్రావు ...ం చేసుకున్నాడు. తనతో తిరిగిన ...లెవరో అతనిని ఫోన్‌చేసి ... అందుకే మూర్తి హడావుడిగా ...డు. అతని కళ్లలో భయం, ఆందో... చోటు చేసుకున్నాయి. రాజేశ్వర్రావుకి ఆ పద్ధతి నచ్చలేదు. మూర్తితో మాట్లాడలేదు. సంతకం చేసిన రిజిస్టరు రైటరు చేతికిచ్చాడు.

"కౌసల్యగార్ని కస్టడీలోకి తీసుకున్నావటః" మళ్ళీ మూర్తి మాట్లాడేడు.

"అతినీతిగా ప్రవర్తించిన వాళ్ళందర్నీ కస్టడీలో తీసుకున్నాం." రాజేశ్వర్రావు చాలా సాఫీగా సమాధానం ఇచ్చాడు. అతను గొప్పవాళ్ళకి ఎలాంటి ప్రత్యేకత ఇవ్వలేదు.

"గొప్ప పని చేశావు. మనకు కోటా పూర్తిచేసుకోవటానికి కావలసినంత మంది జనం ఉన్నారు. మిసెస్ కౌసల్యగార్నీ, ముఖర్జీగార్నీ విడిచిపెట్టి, డియస్పీగారి నోటీసుకి వెళ్ళకుండా జాగ్రత్తపడు." మూర్తి హెచ్చరించాడు.

"ఉన్నవాళ్ళకి మరో చట్టం వుంటే, వాళ్ళని విడిచి పెట్టడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు, సార్." పవిత్రమైన పదవిలోవున్న వ్యక్తి బాధ్యతా రహితంగా మాట్లాడేసరికి, రాజేశ్వర్రావుకి బాధనిపించింది.


"చట్టమూ చట్టు బండానూ చట్టాన్ని పట్టుకుంటే నీ బతుకు చట్టుబండలవుతుంది చేసిన నిర్వాకం చాలు. కేసు రైటాఫ్‌చేసి, వెంటనే వాళ్ళిద్దర్నీ విడిచిపెట్టు."

"బుక్ చేసిన తర్వాత విడిచిపెట్టడం నాకు చేతకాదు, సార్."

"మిస్టర్ రాజేశ్వర్రావ్ నీకూ-నాకూ ఈ వుద్యోగం ఎంత ముఖ్యమో వున్న వాళ్ళకి పరువూ మర్యాదా అంత ముఖ్యం."

"పరువూ మర్యాదా వున్నవాళ్ళు ఇలాంటి నీచమైన పనులు చేస్తారని ఊహించలేదు, సార్."

"నువ్వు ఊహించనివి మరెన్నో వున్నాయి. పెద్దవాళ్ళను గురించి నీకు బొత్తిగా తెలీదు. మిసెస్ కౌసల్య ఏదో తప్పు చేసిందని నువ్వు అనుకున్నట్లు రాయుడుగారు ఆలోచించరు. అసలు వాళ్ళు అలాంటి విషయాలు పట్టించుకోరు. ఈ మోరల్ కాన్షస్ మనలాంటి వాళ్ళకే ఉంటాయి. అవన్నీ వాళ్ల లెక్కచేయరు




గనుకే వాళ్ళను పెద్దవాళ్ళన్నారు. అందమైన భార్య దొరకడం ఒక వరంగా భావిస్తారు. ఆడవాళ్ళ సహకారంతోనే వాళ్ళు అంతస్తులు పెంచుకుంటారు. తెర వెనుక వాళ్ళ కథలు తెలుసుకొని, మనం తెలియనట్లు వూరుకోవాలి! కాదని వాళ్ళను బయటకు లాగితే మనం బతకం. వాళ్ళ నాగరికత వేరు. ఆ మనుషులు వేరు. కౌసల్యగారు తన భర్తను మోసం చేస్తూందని నువ్వనుకుంటున్నావు. అలా అనుకోవడం నీ తప్పు. పెద్దవాళ్ళని తారతమ్యం చూపించకుండా, నీ చట్టానికి బందీలు చేయడం తప్పు తప్పయిపోయిందని క్షమించమని కౌసల్యాగార్ని అపాలజీ అడుగు. నీ తరపున నేను కూడ చెప్తాను." మూర్తి మెల్లమెల్లగా చీవాట్లు వేశాడు.

రాజేశ్వర్రావుకి మతిపోయింది.

అతనికి ముప్ఫయేళ్ళు దాటలేదు. ఉద్యోగంలో చేరి అయిదేళ్ళు దాటలేదు. అతను కొన్ని పచ్చి నిజాలు తెలుసుకున్నాడు. కానీ, ఇంతవరకు జీవితంలో ఇలాంటి 'నిజం' వినలేదు. డబ్బుకోసం మనిషి నైతికంగా దిగజారిపోవడం శోచనీయం. పొట్ట గడవక, పూట గడవక, ఆత్మాభిమానాన్ని అమ్ముకొని, చీకటిలో చస్తున్నారు, కొందరు. కూడబెట్టింది చాలక, కోరికలు తీరక, అసలైన విలువను అమ్ముకొని, వెలుగులో బతుకుతున్నారు, మరికొందరు.

రాజేశ్వర్రావు చాలసేపు మాట్లాడలేదు.

"చూడు, రాజేశ్వర్రావ్ తెలిసో తెలియకో పొరపాటు చేశావు ... మనకు

కావాలి. కోటా పూర్తి చేయాలి. అంతే! మనం రూల్సును పట్టుకుంటేనే బతకం. అందర్నీ ఒక్కలాగే చూస్తే, దెబ్బ తింటాం. చూసినా, చూడనట్లు నటించాలి. పెద్దవాళ్ళని ఇబ్బందిలో పెట్టకూడదు. పెడితే, మనల్ని ఇబ్బందిలో పెడతారు. వాళ్ళని రచ్చకీడ్చకూడదు. ఈడిస్తే, మన మీద కక్ష పెటుకుంటారు." పెద్దవాళ్ళతో పేచీ పెట్టుకోవడం మూర్తికి యిష్టం ఉండదు.

మూర్తి నచ్చజెప్పిచూశాడు. జీవితంలో ఎదురు దెబ్బలు తగిలించుకో వద్దని హెచ్చరించాడు. తన మాట వినమని, పెద్ద వాళ్ళతో పేచీ పెట్టుకోవద్దని సలహా లిచ్చాడు. చట్టాన్ని ఉద్ధరించవలసిన వ్యక్తి నీతిమాలిన మనుషుల్ని ప్రోత్సహించడం రాజేశ్వర్రావుకి నచ్చలేదు. ఉందని డబ్బుతో నయాన్నో భయాన్నో — న్యాయాన్నీ చట్టాన్నీ చేతుల్లోకి తీసుకున్న రాయుడు గారిలాంటి స్వార్థపరుల్ని అతను క్షమించలేడు. అతని మోచేతి నీళ్ళకోసం కక్కుర్తిపడి, చట్టాన్ని కలుషితం చేయలేడు.

మనల్ని చూసి, భయపడే మనుషుల్ని చూసి, మనమే భయపడుతున్నాం. చట్టాన్ని తిరస్కరిస్తున్న వాళ్ళను మనమే ప్రోత్సహిస్తున్నాం.... రాయుడుగారు నా ప్రాణాలు తీస్తారా, ఏఁసార్?" రాజేశ్వర్రావు పగలబడి నవ్వాడు.

మూర్తి చికాకు పడ్డాడు.

"నీలో ఉన్న ఆ ఉడుకు రక్తం అలా నవ్విస్తుంది. నీకు ధైర్యం ఉందనీ, డ్యూటీ కాన్షస్ ఉందని ఒప్పుకుంటాను. కానీ, నీలాంటి ఏ కొద్దిమంది వల్ల ఈ వ్యవస్థ మారదు. ఈ మనుషులూ మారరు. మారని వాళ్ళ కోసం శ్రమ తీసుకోవడం దండగ. మన పద్ధతులు మార్చుకోవాలి. బతకడం కోసం మనం మారాలి. పెద్దవాణ్ణి. దూరం ఆలోచించి, చెబుతున్నాను. ఆర్గ్యూమెంటు చెయ్యకుండా, వాళ్ళిద్దర్నీ "

"వెరీసారీ తప్పుచేసిన వాళ్లెవర్నీ ఊరికే విడిచిపెట్టను." రాజేశ్వర్రావు దృఢంగా సమాధానం యిచ్చాడు.

"ఆల్‌రైట్..." మూర్తి నిట్టూర్చాడు.

మిసెస్ కౌసల్యను, ముఖర్జీని బెయిలిచ్చి, మూర్తి విడిపించాడు.

చట్టం అందర్నీ ఒకేలాగే శిక్షించాలని మనసులో కోరుకున్నాడు, రాజేశ్వర్రావు-వెళ్ళిపోతున్న ఆ ముగ్గుర్ని చూసి.


* * *

సృష్టి చక్రం అలసటలేకుండా తిరుగుతోంది.

సముద్రంలో పుడుతున్న చిన్న చిన్న అలలు పెద్ద పెద్ద కెరటాల తాకిడికి తట్టుకోలేక విరిగిపోతున్నాయి. సముద్రగర్భంలో నిస్సహాయంగా కలిసిపోతున్నాయి. వాటి ఆక్రందన కెరటాలహోరులో వినిపించడం లేదు.

ప్రకృతిలో మార్పు. మనిషిలో మార్పు. ఈ రోజులో మార్పు. పది రోజులు ముందుకి జరిగిపోయాయి. ఎవరూ వెనక్కి తీసుకురాలేనట్లు ముందుకుదొర్లిపోయాయి! చైతన్య స్రవంతి సాగిపోతుంది.

రాజేశ్వర్రావు - తన ఫెయిర్ లేడీని, ఇద్దరు పిల్లల్నీ, ముసల్దయిపోతున్న తల్లినీ విడిచిపెట్టి, ఒంటరిగా మనుషుల్లేని చోటికి




వెళ్ళిపోయాడు. శుభవార్త వినకుండా, చిన్నమాటైనా చెప్పకుండా వెళ్లిపోయిన తన స్వీట్ శ్రీవారిమీద పడి. భోరున ఏడ్చింది—లక్ష్మి.. ఆమె ఆక్రందన రాజేశ్వర్రావుకి వినిపించలేదు. అతను తిరిగి రాలేదు

ఉద్యోగ నిర్వహణలో ఓ దొంగల ముఠాని వెంటాడి. ప్రాణాలు కోల్పోయిన యస్సయి రాజేశ్వర్రావుకి ప్రభుత్వంవారు గౌరవసూచకంగా బంగారు పతకాన్ని యిచ్చారు. అతని ధైర్య సాహసాల్ని మెచ్చుకొని, తన ప్రగాఢ సంతాపాన్ని రాయుడుగారు -రాజేశ్వర్రావు కుటుంబానికి తెలియజేశారు. పదివేల రూపాయల చెక్కును విరాళంగా మిసెస్ కౌసల్య చేతులమీదుగా శ్రీమతి లక్ష్మి రాజేశ్వర్రావుకి అందజేశారు, రాయుడుగారు. అతని ఉదారతకి కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి.

అందరితో కలిసి, మూర్తి కూడ చప్పట్లు కొట్టాడు.

ఆ సమయంలో అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. రాజేశ్వర్రావు పగలబడి నవ్వుతున్నట్లు అనిపించింది.

మనల్ని చూసి, భయపడే మనుషుల్ని చూసి,మనమే భయపడుతున్నాం. చట్టాన్ని తిరస్కరిస్తున్న వాళ్ళను మనమే ప్రోత్సహిస్తున్నాం రాయుడుగారు నాప్రాణాలు తీస్తారా, ఏంసార్?" ★